


## పౌష్టికాహారం అందించాలి

**ప్రజానావ, తాండూర్:** అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందించాలని మండల ప్రత్యేక అధికారి అంజయ్య అన్నారు. గురువారం తాండూర్ మండలం నీలాయిపల్లి గ్రామ పంచాయతీలోని ఒడ్డెర కాలనీలో గల అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీలో చేశారు. ఈ సందర్భంగా పిల్లల విద్య, ఆరోగ్యం, మధ్యాహ్నం తీసుకునే ఆహార విషయాలను అడిగి తెలుసుకొని తగు సూచనలు చేశారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. ఆ తర్వాత గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. గ్రామ పంచాయతీ లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను సైతం పరిశీలించారు. ఆయన వెంట తాండూర్ ఎంపీఓ అనిల్ కుమార్, ఉపాధ్యాయులు మంజుల, అంగన్వాడీ టీచర్ ఉమా, గ్రామ పంచాయతీ కార్యదర్శి రంజిత్ కుమార్, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## విదేశీ విద్యా పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

**జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు**

**ప్రజానావ, మంచిర్యాల:** 2025-26 విద్యా సంవత్సరానికి అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం కోసం అర్హులైన షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు దుర్గాప్రసాద్ తెలిపారు. అర్హులైన విద్యార్థులకు రూ.20 లక్షల ఉపకార వేతనం అందించడం జరుగుతుందని, యుఎస్ఎ, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మని, జపాన్, సౌత్ కొరియా, న్యూజిలాండ్‌లోని విశ్వవిద్యాలయాలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్, ప్రొఫెషనల్ కోర్సులలో విద్య అభ్యసించాలనుకునే షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు www.telangana. epass.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఆగస్టు 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు జిల్లాకు చెందిన షెడ్యూల్డ్ కులాల వారై ఉండాలని, కుటుంబ వార్షిక సంవత్సర ఆదాయం రూ.5లక్షలకు మించి ఉండకూడదని, పీజీ చదవడానికి గ్రాడ్యుయేషన్లో 60 శాతం కంటే ఎక్కువ మార్కులు పొంది ఉండాలని సూచించారు. టిఓఈఎఫ్ఎల్/ఐఈఎల్ టిఎస్/జీఆర్ఈ/జీఎంఎటి ఎక్కువ శాతం అర్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు. పాస్పోర్ట్, వీసా కలిగి ఉండాలని, విదేశీ విశ్వవిద్యాలయము నుంచి అడ్మిషన్ పొంది ఉండాలని, ఒక కుటుంబం నుంచి ఒక్కరు మాత్రమే అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం వివరాలు నమోదు చేసుకోవాలి

**జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి**

**ప్రజానావ, మంచిర్యాల:** 2025-26 విద్యా సంవత్సరానికి గాను పోస్ట్ మెట్రిక్ స్కాలర్షిప్ కోసం ఈ-పాస్లో విద్యార్థులు వివరాలు నమోదు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. నూతన, రెన్యువల్ కోసం జిల్లాలోని కళాశాలల విద్యార్థులు www.telangana.epass.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా తమ వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. సీఈటీఎస్ ద్వారా కన్వీనర్ కోటాలో చేర్చిన విద్యార్థుల వివరాలు నమోదు చేయడతో పోస్ట్ మెట్రిక్ స్కాలర్షిప్ మంజూరు చేయడానికి వీలు కల్పించబడుతుందని పేర్కొన్నారు. స్కాలర్షిప్ పొందాలనుకునే విద్యార్థులు సెప్టెంబర్ 30వ తేదీలోగా వివరాల నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని, కళాశాలలు తమ రిజిస్ట్రేషన్, విద్యార్థులు నమోదు స్థితి వివరాలను పబ్లిక్ పోర్టల్లో తెలుసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## అడ్డా కూలీల సమస్యలను పరిష్కరించాలి



**ప్రజానావ, బెల్లంపల్లి:** అడ్డా కూలీల సమస్యలను పరిష్కరించాలని ఎంసీపీఐయూ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ అన్నారు. గురువారం బెల్లంపల్లి అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ సంతోష్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా డెత్, మ్యారేజ్, డెలివరీ ఫైల్ మీదా ప్రభుత్వం నుంచి రావాల్సిన డబ్బులు అందక కూలీలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. అదేవిధంగా లేబర్ కార్డులతో కూలి పనిచేసుకొనే వారికి ఎన్నో ప్రయోజనాలు ఉన్నప్పటికీ వాటిపై ఏరోజు కూడా అవగాహన సదస్సులు నిర్వహించడం లేదని పేర్కొన్నారు. అవగాహన సదస్సులు నిర్వహించి లేబర్ కార్డులతో కలిగే లాభాలను తెలియజేయాలని కోరారు. వెంటనే లేబర్ కార్డుపై అవగాహన సదస్సులు నిర్వహించి అడ్డా కూలీలకు బెనిఫిట్స్ ను వచ్చే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. లేనియెడల పార్టీ ఆధ్వర్యం లో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# మీడియా వాస్తవాలను వెలువరించాలి

**• జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**ప్రజానావ, మంచిర్యాల:** ప్రింట్, ఎలక్ట్రానిక్ పాత్రికేయులు రాజ్యాంగం కల్పించిన పత్రిక స్వేచ్ఛను సద్వినియోగ పర్చుకొని ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాస్వామ్యంలో పాత్రికేయ రంగానికి ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వాలు చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను ప్రజలందరికీ తెలిపి పథకాల ఫలాలు పొందే విధంగా చేయడంలో మీడియా కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తూ మారుమూల గ్రామాల నుంచి అభివృద్ధి చెందిన పట్టణాల వరకు తమ పరిధిలో జరుగుతున్న అన్యాయాలను, ప్రజల సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసి పరిష్కరించడంలో పాత్రికేయులు తమవంతు బాధ్యత నిర్వహిస్తారని తెలిపారు. మీడియా ద్వారా ప్రపంచానికి తెలియని ఎన్నో వాస్తవాలు బయటపడ్డాయని, ఎంతో మంది బాధితులకు అవసరమైన సహాయం, న్యాయం అందినటుల పేర్కొన్నారు. కానీ జిల్లాలో కొంతమంది పాత్రికేయులు అవాస్తవ వార్త కథనాలను ప్రచురిస్తూ వ్యాపార, వాణిజ్య సంస్థల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో, వ్యక్తిగత బెదిరింపులకు పాల్పడి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలియవచ్చిందని, పాత్రికేయులు ప్రచురించే విషయాలపై పూర్తి నిజనిర్ధారణ చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో కొంతమంది నకిలీ జర్నలిస్టుల కారణంగా అసలైన జర్నలిస్టులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి అవాస్తవాలను ప్రచురిస్తూ, బెదిరింపులకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

# గ్రామపాలన అధికారి పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి



**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**ప్రజానావ, మంచిర్యాల:** ఈనెల 27వ తేదీన జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగనున్న గ్రామపాలన అధికారి పరీక్షను పకడ్బంధీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ పి చంద్రయ్య, మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు శ్రీనివాస్ రావు, హరికృష్ణ లతో కలిసి జిల్లా విద్య, విద్యుత్, వైద్యారోగ్య, సర్వే, పోలీస్, తహశీల్దార్, మున్సిపల్ కమీషనర్ లతో గ్రామపాలన అధికారి పరీక్ష, లైసెన్స్ సర్వేయర్ల పరీక్ష నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 27న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గ్రామ పాలన అధికారులు, లైసెన్స్ సర్వేయర్లకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పరీక్ష నిర్వహణలో భాగంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జవాబు పత్రాల తరలింపు, స్ట్రాంగ్ రూమ్, పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించాలని సూచించారు. పరీక్ష రోజు ఉదయం పరీక్షా కేంద్రాన్ని సందర్శించి అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జిల్లా పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో పరీక్ష తేది, సమయం, పరీక్ష కేంద్రం, నిబంధనలపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. జిల్లాలో నిర్వహించే గ్రామ పాలన అధికారి పరీక్షకు 70 మంది అభ్యర్థులు, లైసెన్స్ సర్వేయర్ల పరీక్షకు 156 మంది అభ్యర్థులు హాజరవుతున్నారని, పరీక్ష సమయంలో పరీక్షా కేంద్రం సమీపంలో సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ అమలు చేయడం జరుగుతుందని, 5 మంది కంటే ఎక్కువ మంది గుంపుగా ఉండకూడదని, పరీక్షా కేంద్రం సమీపంలో జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలని ఆదేశించారు. పరీక్ష రోజు ఉదయం 9గంటలకే అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోనికి అనుమతించడం జరుగుతుందన్నారు. 10 గంటల తర్వాత ఎవరిని అనుమతించడం జరగదని, మొబైల్ ఫోన్, టాబ్లెట్స్, పెన్ డ్రైవ్స్, బ్లూటూత్ పరికరాలు, చేతిగడియారాలు, కాలిక్యులేటర్స్, లాగ్ టేబుల్స్, వాలెట్లు, పర్సులు, నోట్స్, చార్ట్స్, లూస్ షీట్స్, రికార్డింగ్ పరికరాలు, హ్యాండ్బ్యాగ్స్, జోలాస్, పౌచెస్, ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రంలోనికి అనుమతించడం జరుగదని, పరీక్షా కేంద్రం వద్ద ఎలాంటి క్లాక్ రూమ్, స్టోరెజ్ సదుపాయం కల్పించడం జరుగదని తెలిపారు. అభ్యర్థులు పరీక్ష ముందు రోజు తమ పరీక్షా కేంద్రాన్ని సందర్శించాలని తెలిపారు. బ్లూ, బ్లాక్ బాల్ పాయింట్ పెన్స్, హాల్టిక్కెట్, ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డు లను మాత్రమే తమ వెంట తెచ్చుకోవాలని సూచించారు. జిల్లాలో పరీక్షలను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## గుడిహత్నూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

**ప్రజానావ, గుడిహత్నూర్:** గుడిహత్నూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఎన్‌హెచ్ 44 రోడ్డుపై ఇచ్చోడ నుంచి ఆదిలాబాద్ కు బైక్ పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను వెనుక నుంచి లారీ ఢీకొంది. ఈ ఘటనలో మహారాష్ట్ర నాందేడ్ జిల్లా సావ్రి గ్రామానికి చెందిన భానుదాస్ ఘటన స్థలంలోనే మృతిచెందాడు. మరో వ్యక్తి బాబూరావుకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## జిల్లాలో సోషల్ మీడియా ట్రాకింగ్ సెల్

**సోషల్ మీడియా పోస్టులపై ప్రత్యేక నిఘా**

**అసత్య ప్రచారాలు చేస్తే క్రిమినల్ కేసులు.. సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ బీ గితే**

**ప్రజానావ, సిరిసిల్ల:** సోషల్ మీడియాలో ప్రత్యేక నిఘా పెట్టామని, రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ బీ గితే గురువారం ఆయన ఒక ప్రకటలో హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సోషల్ మీడియా ట్రాకింగ్ సెల్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో మత విద్వేషాలు రెచ్చగొట్టేలా, ఒక వర్గాన్ని, పార్టీని టార్గెట్‌గా చేసుకొని పోస్టులు పెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సామాజిక మాధ్యమాల్లో (ట్విటర్, ఫేస్‌బుక్, వాట్సాప్, ఇతర సోషల్ మీడియా) వచ్చే పోస్టులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నిజనిజాలు తెలుసుకోకుండా ఎట్టి పరిస్థితుల్లో వాటిని ఫార్వర్డ్ చేయకూడదని సూచించారు. సోషల్ మీడియా పోస్టులపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సోషల్ మీడియా ట్రాకింగ్ విభాగం ప్రతి పోస్టును నిశితంగా పరిశీలించడం జరుగుతుందన్నారు.

## హత్యాయత్నం కేసులో నిందుతురాలికి జైలు, జరిమానా

**ప్రజానావ, వేములవాడ:** హత్యాయత్నం కేసులో నిందుతురాలికి మూడేళ్ల జైలుతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ అసిస్టెంట్ సెషన్ కోర్టు న్యాయమూర్తి అజయ్ కుమార్ జాదవ్ గురువారం తీర్పు వెల్లడించినట్లు వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట్ మండలం నారాయణపూర్‌కు చెందిన కోనేటి రవి, రాజమని దంపతుల కూతురు ప్రేమలత ప్రేమ వివాహం చేసుకుంది. ఈ వివాహానికి బొర్రోజు జనార్దన్ కూతురు సహకరించిందనే అనుమానంతో తిప్పాపూర్ వార్డు వేములవాడకు చెందిన బొర్రోజు జనార్దన్ తండ్రి రగునాథం ఇంటికి కోనేటి రవి భార్య రాజమని వచ్చింది. బొర్రోజు జనార్దన్ కూతురితో మాట్లాడతానని నమ్మించి బిల్డింగ్‌పైకి తీసుకెళ్లి కిందకు తోసేసి చంపేందుకు ప్రయత్నం చేసింది. ఈ ప్రమాదంలో బొర్రోజు జనార్దన్ కూతురికి తీవ్రగాయాలయ్యాయి. బొర్రోజు జనార్దన్ 2020 ఫిబ్రవరి 2వ తేదీన వేములవాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్ఐ మాలకొండ రాయుడు కేసు నమోదు చేయగా, దర్యాప్తు అధికారి సీఐ వెంకటేశ్ కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. సీఎంఎస్ ఎస్ఐ రవీంద్రనాయుడు, కానిస్టేబుల్ మధుసూదన్, కోర్టు కానిస్టేబుల్ సురేశ్‌లు కోర్టులో సాక్ష్యులను ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజిరెడ్డి వాదించగా, కేసు పూర్వపరాలను పరిశీలించి అసిస్టెంట్ సెషన్ కోర్టు న్యాయమూర్తి అజయ్ కుమార్ జాదవ్ నిందుతురాలికి మూడేళ్ల జైలుతో పాటు రూ.1000 జరిమానా విధించినట్లు వేములవాడ టౌన్ సీఐ వీర ప్రసాద్ తెలిపారు.

